

పెద్దదర్గాలో హీరో సాయి ధరమ్‌తేజ్ ప్రార్థనలు

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప నగరంలోని అమీన్‌పీర్ దర్గాలో శుక్రవారం ప్రముఖ సినీ హీరో సాయి ధరమ్‌తేజ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తేజ్‌కు నిర్వాహకులు పూలచాదర్ సమర్పించారు. దర్గా నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. దర్గా మత పెద్దలు అమీన్‌పీర్ దర్గా విశిష్టతను సాయిధరమ్‌తేజ్‌కు తెలియజేశారు. తొలిసారిగా తాను కడప పెద్దదర్గాను దర్శించుకుని ఆత్మసంతృప్తి పొందానని తేజ్ చెప్పారు. దర్గాను దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని తేజ్ అన్నారు. హీరో సాయి ధరమ్ తేజ్‌ను చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. అనంతరం దుర్గమ్మ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.



పెద్దదర్గాలో ప్రార్థనలు చేస్తున్న సాయి ధరమ్‌తేజ్

టికెట్ల కోసం కసరత్తు



లోకేష్ పాదయాత్ర తర్వాత సర్వే బృందాలు
ఆరు అసెంబ్లీలపై నిశిత పరిశీలన
దసరా నాటికి ఉమ్మడి జిల్లాలో స్పష్టత

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల సమరానికి రెండు ప్రధాన పార్టీలు కసరత్తును వేగవంతం చేస్తున్నాయి. నిత్యం జనం మధ్యలో ఉండే కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఎన్నికల బరిలో దింపే అభ్యర్థులపైన స్పష్టత కోసం దృష్టి పెట్టాయి. అధికార వైసిపి ఉమ్మడి కడపలో దాదాపు సిట్టింగులకే టికెట్ ఖరారు చేసే అవకాశం కనిపిస్తోంది. వీటిపై ప్రత్యేక కసరత్తు చేయాల్సిన అవసరం కనిపించడంలేదు. ఆ పార్టీ కూడా అభ్యర్థుల ఎంపిక అనే అంశాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదు. ఏదో ఒక ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఉండేలా ప్రాధాన్యం ఇస్తోంది.. ఇక ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీకి ఉమ్మడి జిల్లాలో అభ్యర్థుల ఖరారు తలనొప్పిగా మారింది. జిల్లాలోని పది నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు జమ్మలమడుగు, పులివెందుల స్థానాల్లో మినహా ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థుల ఖరారు చేయాల్సింది. వీటిలో కమలాపురం, మైదుకూరు నియోజకవర్గాల అభ్యర్థుల ఇప్పటికే స్పష్టత ఉన్నా మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో ఒకరికి మించి ఇద్దరు, ముగ్గురు, నలుగురు కూడా టికెట్ కోసం ఎక్కువగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేస్తుండంతో ఎవరికి టికెట్ ఇవ్వాలనేది అధిష్టానానికి తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో సర్వేలకు ప్రధానం ఇస్తోంది. లోకేష్ పాదయాత్ర తర్వాత జిల్లాలో తెలుగుదేశం పార్టీ సర్వే బృందాలు పరిస్థితులు, జనంలో తెలుగుదేశం పార్టీకి ప్రాధాన్యం ఏమేరకు పెరిగింది, ఈ అంశాలకు జిల్లాలో ప్రాధాన్యం ఇవ్వాలి, ఇలాంటి అంశాలతో సర్వే చేస్తున్నట్లుకి ఆరు నియోజకవర్గాల్లో అభ్యర్థులపైన కూడా సర్వే బృందాలు నిశిత పరిశీలన కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు సమాచారం. ఈ సర్వే ఆధారంగా అధినేత చంద్రబాబుకు జిల్లాలో నాయకుల పైన, జిల్లా పట్ల ఉన్న అభిప్రాయంతో అభ్యర్థుల ఖరారుకు తుదిరూపం ఇచ్చి దసరా నాటికి అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులపై స్పష్టత ఇచ్చే పనిలో ఉన్నట్లు సమాచారం.

ఆ ఆరు చోట్లు పోటా పోటీ

ఉమ్మడి జిల్లాలోని ఆరు నియోజకవర్గాలైన ప్రొద్దుటూరు, బద్వేలు, కడప, రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ టిక్కెట్లకు పోటా పోటీ ఏర్పడింది. ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ ఆరు చోట్ల అభ్యర్థిత్వంపై సరైన స్పష్టత కనిపించకపోవడంతో టిడిపి కార్యకర్తలు కూడా అయోమయంలో ఉన్నారు. ఏ నాయకుడు వద్ద పని చేయాలో తెలియక గ్రూపు రాజకీయాలతో నలిగి పోవాల్సి వస్తోంది. ఈ నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించడం టిడిపికి అంత సులువైన అంశం కాదు. అభ్యర్థిగా అవకాశం దక్కని వారు అసంతృప్తికి గురికావడం, పార్టీకి నష్టం కలిగించే అవకాశాలు దారితీసే పరిస్థితి ఎదురు కావడం లాంటి పరిణామాలు ఎదురవుతాయనే ఆందోళన పార్టీలో కనిపిస్తోంది. కాగా రాజంపేటకు మాజీ ఎమ్మెల్యే బత్యాల చెంగల్రాయుడు టికెట్ రేసులో ముందు వరుసలో ఉండగా రాయచోటి చెందిన ప్రముఖ విద్యా సంస్థల అధినేత జగన్మోహన్‌రాజు గట్టి ప్రయత్నంలో ఉన్నారు. టికెట్ పై ధీమా కూడా వ్యక్తం చేస్తున్నారు. రైల్వేకోడూరులో గత ఎన్నికల్లో పోటీ చేసిన పంతగాని ప్రసాదు ఆశావహుల్లో టిక్కెట్‌పై ఖచ్చితమైన ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ప్రధాన నాయకుడైన విశ్వనాథ నాయుడుకు ప్రసాద్‌కు సరైన సంబంధాలు కనిపించడం లేదు. ఇక్కడ నుండి మరో మహిళ అనితా దీప్తి టికెట్ రేసులో ఉన్నారు.

రాయచోటిలో మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డితో పాటు మరో ఎమ్మెల్యే ద్వారకానాథ్‌రెడ్డి కూడా టికెట్ ఆశిస్తున్నారు. మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి టికెట్ కోసం గట్టిగా ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పార్టీ వ్యూహ కర్త రాబిన్ శర్మ టీం జిల్లాలో పర్యటిస్తున్నట్లు సమాచారం.

ప్రొద్దుటూరులోనూ అదే పరిస్థితి

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో టికెట్ తనకే అన్న ధీమాతో ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఉండగా మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కూడా నమ్మకంతో ఉన్నారు. మరో మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి ఉండగా ఇటీవల కొద్ది రోజులుగా సిఎం సురేష్‌నాయుడు పార్టీలో క్రియాశీలకంగా మారారు. నలుగురిలో ఎవరు అభ్యర్థి అవుతారు అన్నది స్పష్టత రావాల్సి ఉంది.

కడపలో ఎవరు?

కడప అసెంబ్లీలోనూ ఎక్కువ మంది ఆశావహులున్నారు. అయినా ప్రధానంగా ఇద్దరు పేర్లు మాత్రమే వినిపిస్తున్నాయి. వీరిలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మిరెడ్డి కోడలు, కార్పొరేటర్ ఉమాదేవి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి సతీమణి మాధవి లతలున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి అమీర్‌బాబు కూడా టికెట్ కోసం ప్రయత్నం చేస్తున్నారు. వీరిలో ఎవరిని అభ్యర్థిగా ఖరారు చేస్తారన్నది ఆ పార్టీలో ఉత్కంఠంగా మారింది.

బద్వేలు బరిలో ఎవరికి చోటు

ఎస్‌సి రిజర్వుడ్ అసెంబ్లీ నియోజకవర్గమైన బద్వేలులో కూడా ఆశావహులసంఖ్య ఎక్కువగానే ఉంది. వీరిలో గత ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ ఓబు లాపురం రాజశేఖర్ మొదటి వరుసలో ఉండగా అదే నియోజకవర్గంలోని పోరుమామిళ్లకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి రోషన్ పేరు కూడా బాగా వినిపిస్తోంది. వీరు ఇరు వురే కాకుండా కడపకు చెందిన మాజీ గవర్నమెంట్ ప్రాసిక్యూటర్ గుర్రప్ప టికెట్ కోసం గట్టి ప్రయత్నం చేస్తున్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె విజయవంతం

- డిఎల్‌పిఒ హామీతో దీక్షలు విరమణ



పంచాయతీ కార్మికులు దీక్షలు విరమింప చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పంచాయతీ కార్మికులకు ఇఎస్ఐ, ఇపిఎఫ్ సౌకర్యం కల్పిం చాలని, హైకోర్టు తీర్పు అమలు చేయాలని, కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని, మర ణించిన కార్మికులకు మట్టి ఖర్చులు రూ.25 వేలు ఇవ్వాలని, అక్రమంగా తొల గించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన పంచా యతీ కార్మికుల పోరాటం విజయవంతమైంది. శుక్రవారం మదనపల్లె డిఎల్‌పిఒ నాగరాజు నిరవధిక రిలే దీక్షలు చేస్తున్న పంచాయతీ కార్మికులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. అంతకు ముందు డిఎల్‌పిఒ, సిఐటియు నాయకులు, పంచాయతీ కార్మికుల సంఘం నాయకులతో చర్చలు జరిపారు. ఇపిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం, బ్యాంకు ద్వారా వేతనాలు చెల్లించడం ఈ నెల నుండి ప్రారం భం చేస్తామని, 57 జిఒ ప్రకారం వేతనాలు చెల్లించాలని, తొలగించిన కార్మికు లను విధుల్లోకి తీసుకోవాలని పంచాయతీలకు సర్క్యులర్ ఇస్తామని హామీ ఇచ్చారు. డిఎల్‌పిఒ హామీతో దీక్షలు విరమించినట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్య దర్శి ఎస్.సురేంద్రబాబు ప్రకటించారు. అధికారులు ఇచ్చిన హామీ ప్రకారం అమలు చేయాలని లేని పక్షంలో మరింత ఉధృతంగా పోరాటం చేస్తామని హెచ్చ రించారు. ఆందోళనకు మద్దతు తెలిపిన సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ రాజంపేట పార్లమెంటు సభ్యులు మిధున్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే నవాజ్‌బాషాలు గ్రామీణ ప్రాంతాల్లో తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ఆరోగ్యం కోసం కృషి చేస్తున్న పంచాయతీ కార్మికులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. వారు గొంతెమ్మ కోర్కెలు కోరలేదని, ప్రభుత్వం ఇచ్చిన జిఒలను అమలు చేయాలని, ఇఎస్ఐ, ఇపిఎఫ్ సౌకర్యం కల్పించాలని, వేతనాలు బ్యాంకు ద్వారా ఇవ్వాలని కోరితే అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్న అధికార పార్టీ నాయకులను కాపాడుకోవడం కోసం కార్మికులపై కేసులు పెడతారా అని ప్రశ్నిం చారు. నిజాయితీకి మారుపేరుగా గొప్పలు చెప్పుకుంటున్న మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్ బాషాకు సర్పంచ్‌లు చేస్తున్న దుర్మార్గం కనపడలేదని విమర్శించారు. పంచాయతీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని లేనిప క్షంలో ఈ ప్రభుత్వం ఇంటికి పోవడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రవాణా ట్రాన్స్‌ఫోర్ట్ జిల్లా నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సంఘం నాయకులు గోపాల్, ఇమ్రాన్, నాగరాజు, ప్రమీల, శ్యామల, రాజేంద్ర పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటర్ల జాబితా తయారీకి చర్యలు : గిరీష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో వందశాతం తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించడమే లక్ష్యం కావాలని కలెక్టర్ గిరీష ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలకు ఉద్బోధించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024 అంశంపై ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలకు ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయా అంశాలకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొం దించడానికి బాధ్యతగా కృషి చేయాలన్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ అంశానికి సంబంధించి పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని, ఇక్కడ శిక్షణలో అవగాహన పొందిన తహశీల్దార్లు, ఆర్‌డిఒలు మండలాలలో సూపర్వైజర్లు, బిఎల్‌ఒలకు శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో రూపొందిస్తున్న ప్రత్యేక ఎలక్టరోల్‌పై బిఎల్‌ఒలు ప్రతి ఇంటికి వెళ్లి ఖచ్చితంగా పరిశీలన చేసి పటిష్టవంతంగా జాబితా రూపొందించాలని సూచించారు. ఈ క్రమంలో ఏవైనా విజ్ఞప్తులు, తొలగింపులు అందితే అప్పటికప్పుడే వాటిని నమోదు చేసుకొని పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఒకే ఇంట్లో పది మంది ఓటర్ల కంటే ఎక్కువ మంది ఉంటే వాటిని పక్కగా పరిశీలన చేయాలని సూచించారు. ఫామ్ 6, 7, 8లను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఫామ్ 6బిలో ఓటర్ కార్డుకు ఆధార్ లింక్ చేయాలని, జిల్లాలో 90 శాతం మేర పూర్తి చేశారని, మిగిలినవి కూడా పూర్తి చేయాలన్నారు. ఇపి రేషియో, జండర్ రేషియో బాగానే ఉందన్నారు. ఒకే రకమైన రెండు ఫోటోలు, డూప్లికేట్ ఓటర్లను పక్కాగా తొలగించాలని, ఈ విషయంలో ఆర్డీఒలు, తహశీల్దార్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 18-19 వయసు ఉన్న యువత కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి తగువిధంగా అవగాహన కల్పించాలన్నారు. నియోజకవర్గాల వారీగా జిల్లాలో అర్హులైన ఓటర్లు వందశాతం నమోదు కావాలని... ఇందుకు మండలాలలో ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం వివిధ అంశాల్లో తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో డిఆర్‌ఒ సత్యనారాయణ, ఆర్డీఒలు రంగస్వామి, మురళి, తహశీల్దార్లు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న శ్రీకాంత్‌రెడ్డి

ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతాం :'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అభివృద్ధిలో రాయచోటి పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దు తున్నామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కొత్తపేట 20, 21వ వార్డులలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. రెడ్డెన్న వీధి, సాయిరాం వీధి, నెహ్రూ నగర్, టెంకాయచెట్ల వీధి, గాంధీ నగర్, నేషనల్ హైస్కూల్ వీధి, ప్రశాంత్ నగర్, సింగపూర్ లైన్, కాకతీయ కాలేజ్ లైన్, విఆర్ స్కూల్ వీధి, ముస్తఫా వీదులలో గడప గడపను సందర్శించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న వారిని, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, పథకాలు అందని వారితో ఆప్యాయత, ప్రేమానురాగాలుతో ప్రజలను పలకరిస్తూ, సమస్యల పరిష్కారంపై బిడ్డలా, సోదరునిలా చొరవచూపుతూ ప్రతి గడపను శ్రీకాంత్‌రెడ్డి సందర్శించారు. కొత్తపేట అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. పారిశుధ్యం మరింత మెరుగునకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాష, సివిల్ సప్లైస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, నాయకులు జయరామిరెడ్డి, మహేష్‌రెడ్డి, మండల బిసి నాయకుడు పల్లపు రమేష్, కౌన్సిలర్లు కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, కొలిమి ఛాన్‌బాష, సుగవాసి శ్యామ్, జానం రవీంద్ర యాదవ్, షబ్బీర్, పల్లా రమేష్, మురికినాటి వెంకట్రామిరెడ్డి, అమరనాధరెడ్డి, అనీల్ రెడ్డి, గంగిరెడ్డి, విల్వపతిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా సంఘ సభ్యుడు దిన్నెపాడు రవిరాజు, మానవత యర్రపురెడ్డి బ్రహ్మానందరెడ్డి, లక్ష్మీకర్ రెడ్డి, షిరిడీ సాయి మహిళా కళాశాల డైరెక్టర్ మనోజ్ రెడ్డి, శంకర్‌రెడ్డి, కో-ఆప్షన్ హజరత్ ఖాదర్ వలీ, పాల్గొన్నారు.

సీనియర్ గ్రేడ్ అధికారిగా ధర్మనాయక్ ఎంపిక

ప్రజాశక్తి-రాయచోటి

ఇటీవల యుపిఎస్‌సి ఇండి యన్ సర్వీస్ మినిస్ట్రీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్‌లో సీనియర్ గ్రేడ్ గెజిటెడ్ ఆఫీసర్ పోస్ట్‌కు సంబంధించి విడుదల చేసిన ఫలితాల్లో జిల్లా ఐఅండ్ పిఆర్ పిఆర్‌ఒ బుక్కే ధర్మనాయక్ ఎంపిక య్యారు. ఈయన టి.సుండుపల్లె మండలం వైఎన్.పాళెం కుప్పగుట్టపల్లెకు చెందిన వారు. యుపిఎస్‌సి ద్వారా 34 ఉద్యోగాలకు సంబంధించి దేశవ్యాప్తంగా 267 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. అందులో ఎస్‌టి క్యాటగిరీకి సంబంధించి ఆయన ఎంపికయ్యారు. ఇప్పటికే సమాచార శాఖలో



పౌర సంబంధాల శాఖ అధికారిగా 2019 సెప్టెంబర్ నుంచి కర్నూలులో, ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నవరత్నాలు సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాల పైన విస్తృతంగా ప్రచారం చేయడంతో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకున్నారు. ప్రాథమిక స్థాయి విద్య టి.సుండుపల్లె, ఇంటర్, డిగ్రీ రాయచోటి, పీజీ మాస్ కమ్యూనికేషన్ జర్నలిజం యోగి వేమన విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేశారు. తండ్రి బి.వెంకటరమణ నాయక్, అమ్మ పాపులమ్మ వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. భార్య మూడే శిరీష, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అన్నమయ్య జిల్లా సమాచార శాఖ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి భరత్ కుమార్‌రెడ్డి, డిపిఆర్‌ఒ పురుషోత్తం, సమాచార శాఖ సిబ్బంది ఈ సందర్భంగా ధర్మనాయిక్‌ను అభినందించారు. ఆయన 2010 నుంచి 2019 వరకు టి.సుండుపల్లె మండల కేంద్రంలో పలు పత్రికల్లో జర్నలిస్టుగా పనిచేశారు.

వేగవంతంగా అంగన్వాడీ భవన నిర్మాణాలు : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

నాడు-నేడులో మంజూరైన అంగన్వాడీ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ గిరిష ఐసిడిఎస్ సిడిపిఒ, సూపర్వైజర్‌లను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఐసిడిఎస్ సిడిపిఒ, సూపర్వైజర్‌లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూఫ్ లెవల్‌లో బిల్డింగ్ లన్ని ఈ నెల ఆఖరికి పూర్తి కావలన్నారు. నవజాతి శిశువు నుంచి ఆరు నెలలు, ఏడు నెలల నుంచి 36 నెలలు, 37 నెలల నుంచి 72 నెలల పిల్లల పెండింగ్ ఆధార్ ఎన్‌రోల్ మెంట్ త్వరగా పూర్తి చేయాలన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఉండాల్సిన బరువు కన్నా తక్కువ, ఉండాల్సిన ఎత్తు కన్నా తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అంగ న్వాడీ కేంద్రాలపై సిడిపిఒలు, సూపర్వైజర్లు



మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

తప్పకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్స్ బాలాం మృతం, గుడ్లు, పాలు, బియ్యం, కందిపప్పు, నూనె క్వాలిటీని పరిశీలించాలన్నారు. అవన్నీ పిల్లలకు గర్భిని మహిళలకు, బాలింతలకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వారం అంగన్వాడీ కేంద్రాలను మహిళా పోలీసులు తనిఖీ చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐసిడిఎస్ పీడీ ధనలక్ష్మి, సిడిపిఒలు, సూపర్వైజర్లు, సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

సర్పంచుపై ఎంపిడిఒకు వార్డు సభ్యుల ఫిర్యాదు

వాల్మీకిపురం: మండలంలోని చింతపర్తి మేజర్ పంచాయతీ అభివృద్ధిని సర్పంచ్ మహిత ఏ మాత్రం పట్టించుకోవడం లేదని శుక్రవారం ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్‌కు మెజార్టీ వార్డు సభ్యులు ఫిర్యాదు చేశారు. 10 మంది వార్డులు సభ్యులు సర్పంచ్, సర్పంచ్ భర్త శేషాద్రిరెడ్డిపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాట్లాడుతూ చింతపర్తి మేజర్ పంచా యతీలో ప్రజలకు కనీస అవసరాలైన తాగు నీరు, వీధిలైట్లు, రోడ్లు, పారిశుధ్యం తదితర సమస్యలను సర్పంచ్ ఏ మాత్రం పట్టించు కోవడం లేదన్నారు. గ్రామంలో వీధి లైట్ల సమస్య ఉన్నాయని తక్షణం స్పందించి పరిష్కరించాలని జూన్ 8న జరిగిన గ్రామ పంచాయతీ సమావేశంలో ప్రతిపాదించగా అందుకు సమ్మతించి తీర్మానించారని, అయినా ఇప్పటి వరకు ఏ మాత్రం పట్టించు కోలేదన్నారు. 1902 స్పందన కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను సైతం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని, గ్రామ పంచాయతీ జనరల్ ఫండ్ నిధులు దాదాపు రూ.11 లక్షలు ఉన్నా పంచాయతీ కార్యదర్శి, సిబ్బం దికి ఏ మాత్రం సహకరించకుండా అభివృద్ధికి అడ్డు పడుతున్నారన్నారు. ప్రజా సమస్యలు, ప్రజాభివృద్ధిని పట్టించుకోని సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పం దించిన ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్ మాట్లా డుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఉమాదేవి, ముబారక్, అనసూయ, భూదేవి, భరత్ కుమార్, శ్రీనివాసులు, కల్యాణి, రవీం ద్రాచారి, వెంకట్రమణరెడ్డి, రమణమ్మ, వైసిపి నాయకులు లక్ష్మినారాయణరెడ్డి, మెంబరు శీనా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పును ప్రభుత్వం ఆచరించాలి

రాజంపేట అర్బన్: యంత్రాలతో ఇసుక తవ్వడాన్ని నిషేధిస్తూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ గతంలో ఇచ్చిన తీర్పుపైన స్టే ఇవ్వడానికి సుప్రీం కోర్టు నిరాకరించిందని, ఈ తీర్పున్టు ప్రభుత్వం ఆచరించాలని కాంగ్రెస్ పార్టీ రాజంపేట నియో జకవర్గ ఇన్‌ఛార్జి పూలభాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అనేకచోట్ల గుట్టలు గుట్టలుగా ఇసుకను కుప్పలు పోయడాన్ని చూస్తుంటే యంత్రాలతో భూమిని ఎంత లోతుల్లోకి తవ్వుతున్నారో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వంలో వేల కోట్ల రూపాయల అక్రమ ఇసుక వ్యాపారం చేస్తూ ప్రకృతిని పూర్తిగా ధ్వంసం చేస్తున్నారని ఆరోపిం చారు. ఇప్పటికైనా యంత్రాలతో ఇసుక తవ్వకా లను నిలిపివేయాలని, రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు తీర్పును ఆచరించాలని డిమాండ్ చేశారు.

ఉచితంగా పాఠ్య పుస్తకాలు ఇవ్వాలి

రాజంపేట అర్బన్: ప్రభుత్వ జూనియర్, ఎయిడెడ్ కళాశాలల్లో చదివే ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందించాలని పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు యు.గనిరాజు అన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమ స్యలపై శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు సునీల్, కోశాధికారి జాకీర్, జిల్లా అధ్యక్షులు నాగేశ్వర, పట్టణ నాయకులు శిరీష, శ్రీలేఖ, హెప్సీబా, గౌసియా, పవన్, యస్వంత్, వెంకటేష్, ఆంజనేయులు, సుదర్శన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కె.గుణశేఖరపిళ్లై

పశుగ్రాసాభివృద్ధికి కృషి చేయాలి

- జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ కె.గుణశేఖరపిళ్లై

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో పశుగ్రాసాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ కె.గుణశేఖరపిళ్లై పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి కార్యాలయంలో పశుగ్రాస వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి ఆధ్వర్యంలో ఒక రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాల పశుగ్రాసాలు, వాటి పాడి పద్ధతులు, నిల్వ చేయు పద్ధతులు, వాటి పోషక విలువలు, ప్రాముఖ్యత వివరాలను తెలియజేశారు. పశుగ్రాసాభివృద్ధికి పశుసంవర్ధక శాఖ అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను వివరించారు. వివిధ అంశాలలో రైతులు వెలిబుచ్చిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఉప సంచాలకులు శ్రీనివాసులు నాయుడు, అస్టిస్టెంట్ డైరక్టర్లు డాక్టర్ ఎస్.వి.శివారెడ్డి, డాక్టర్ టి.శ్రీధరెడ్డి, డాక్టర్ లోకేష్, పశువైద్య సహాయ శస్త్ర చికిత్సకులు డాక్టర్ ఎన్.రవికుమార్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజంపేట అర్బన్ : పశువులకు సంవత్సరం పొడవునా పచ్చి మేత వేయడం వలన అధిక పాల దిగుబడి సాధించవచ్చునని రాజంపేట డివిజన్ పశువైద్య ఉప సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్ రైతులకు సూచించారు. ఆకేపాడు పంచాయతీలోని పెద్దూరు గ్రామంలో పశు విజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెవిఒలు వరదయ్య, పూజా ప్రియాంక, పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ శ్రీలత

పీలేరు: ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల సిఎస్ఎస్ స్త్రీ వైద్య నిపుణులుగా డాక్టర్ శ్రీలత బాధ్యతలు స్వీకరించారు. రాజంపేట నుండి పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు బదిలీపై వచ్చిన డాక్టర్ శ్రీలతను గురువారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.చంద్రశేఖర్ తన వైద్య బృందంతో కలిసి స్వాగతం పలికారు. డాక్టర్ శ్రీలత, డాక్టర్ రవి శంకర్‌రెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ డాక్టర్ శ్రీలత గతంలో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందించిన సేవలు ఆసుపత్రి చరిత్రలో చిరస్థాయిగా మిగులి పోతాయన్నారు. రోగులు ఏ సమయంలో వచ్చినా వారిని అనారోగ్య పరిస్థితుల నుండి సంపూర్ణ ఆరోగ్య స్థితికి తిరిగి కోలుకునే వరకు కంటికి రెప్పలా కాపాడుతూ శక్తి వంచన లేకుండా వైద్య సేవలు అందించడంలో తనకు తానే సాటి అని కొనియాడారు. పీలేరు వైద్యశాలకు వచ్చే రోగులకు ఆమె సేవలు ఇక ముందు అలాగే కొనసా గాలని కోరారు. కార్యక్ర మంలో డాక్టర్ రవిశం కర్‌రెడ్డి, డాక్టర్ నాగవేణి, డాక్టర్ భారతి దంపతులు, నర్సింగ్ సిబ్బంది, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శ్రీలత

సమస్యల పరిష్కారానికే విద్యుత్ అదాలత్

- సిజిఆర్ఎఫ్ చైర్మన్ రామ్మోహన్‌రావు

రాయచోటి: రైతుల సమస్యల పరిష్కారానికి విద్యుత్ అదాలత్ కార్యక్రమని సిజిఆర్ఎఫ్ చైర్మన్ రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు కింది స్థాయిలో సమస్యలు పరిష్కారం కానిచో కన్స్యూమర్ గ్రీవెన్స్ సెల్‌కు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఎపిఇఆర్‌సి కమిషన్ పరిధిలోని వినియోగదారులకు విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఎదురయే సేవా లోపాలను సత్వరం పరిష్కరించి తొందరగా న్యాయం చేకూర్చుటకు విద్యుత్ చట్టం 2003 ప్రకారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక, రైతులకు, వినియోగదారులకు న్యాయం చేకూర్చే విధంగా కృషి చేస్తుందన్నారు. కడప జిల్లా ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ కె.రమణ మాట్లాడుతూ వినియోగదారులకు ఈ ప్రాంతంలో మెరుగైన సేవలు అందించేందుకు ఉద్యోగస్తులు కంకణ బద్ధులై ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా కృషి చేసి మంచి పేరు తెచ్చుకోవాలని పేర్కొన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటి ప్రాంతంలో రైతులకు, వినియోగదారులకు, విద్యుత్



మాట్లాడుతున్న సిజిఆర్ఎఫ్ చైర్మన్ రామ్మోహన్‌రావు

మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు, విద్యుత్ సరఫరాలో లోఓల్టేజ్ హెచ్చుతగ్గులను నియంత్రించి, మీటర్ల లోపాలకు సంబంధించి, కొత్త విద్యుత్ సర్వీసులకు, ఆదనపులోడు మంజూరు చేయుటకు, విద్యుత్ బిల్లుల్లో లోపాలు ఏవైనా ఉంటే తక్షణమే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎడిఇలు, ఎఇలు, విద్యుత్ సిబ్బంది, వినియోగదారులు, రైతులు పాల్గొన్నారు.



నర్సరీ నిర్వాహకులకు నోటీసును అందిస్తున్న ఉద్యానవనశాఖ అధికారి నాగమణి

నర్సరీ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-గాలివీడు

నర్సరీ నిర్వాహకులు నిబంధనలు పాటించాలని ఉద్యానవనశాఖ అధికారి టి.నాగమణి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో ఏర్పాటు చేసిన పలు నర్సరీలను ఆమె పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. నాణ్యమైన విత్తనాలను మాత్రమే ఉపయోగించాలని, రిజిస్టర్లు నిర్వహించాలని సూచించారు. మొక్కలు విక్రయించే సమయంలో విత్తన తాలూకు పూర్తి సమాచారంతో రశీదులను అందించాలన్నారు. నర్సరీ లైసెన్స్ నెంబరు, ప్రింట్ అయిన బిల్లు మాత్రమే రైతులకు ఇవ్వాలన్నారు. నర్సరీ లోపల పసుపు నీలపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేయాలని, ప్రతి బెడ్డుకు ముందు ఆ బెడ్డులో పోసిన నారును సూచిస్తూ కంపెనీ, వెరైటీ నాటిన తేదీ వివరాలు గల బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన నర్సరీ నిర్వాహకులు తప్పనిసరిగా లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకొని లైసెన్స్ పొందాలన్నారు. నర్సరీలో పేరు కనిపించేలా ప్రత్యేక సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. నర్సరీలో కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలని వివరించారు. పైన తెలిపిన నిబంధనలు పాటించని నర్సరీ నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సిబ్బంది మల్లిక, రైతులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒకు వినతి పత్రం సమర్పిస్తున్న జనసేన నాయకులు

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడాలని జనసేన రాజంపేట అసెంబ్లీ ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ అన్నారు. వాలంటీర్ వ్యవస్థను వినియోగించుకొని రాష్ట్రంలో వైసిపి చేస్తున్న అరాచకాలు చేస్తోందని శుక్రవారం జనసేన నాయకులు ఆర్‌డిఒ భాగ్యరేఖకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది వాలంటీర్లు ప్రభుత్వానికి తొత్తులుగా పనిచేస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో అధికార పార్టీకి కొమ్ము కాస్తూ ఓటుకు నోటు పంపడం ప్రజలు చూశారని తెలిపారు. వాలంటీర్ల ద్వారా ప్రజలను సేకరించిన సమాచారాన్ని వైసిపి ప్రభుత్వం దుర్వినియోగం చేస్తూ అక్రమాలకు పాల్పడుతోందని తెలిపారు. వైసిపి పాలనలో దౌర్జన్యం, దుర్మార్గం, అక్రమాలు హెచ్చుమీరాయని ఇసుక అక్రమరవాణా, మట్టి, మైనింగ్ మాఫియా విచ్చలవిడిగా సాగిస్తున్నారని ఆరోపించారు. వీటిపై ప్రశ్నించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు సమాధానం చెప్పలేక కొందరు వాలంటీర్ల ద్వారా ఆయన పై బురద జల్లుతున్నారని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.



పిసిసి అధ్యక్షునికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆనంద్ యాదవ్

ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీకి అవకాశమివ్వండి

- పిసిసి అధ్యక్షులు రుద్రరాజుకు ఆనంద్‌యాదవ్ వినతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తుర్రు ఆనంద్‌యాదవ్ విజయవాడలో పిసిసి అధ్యక్షులు రుద్రరాజును కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లెలో అసెంబ్లీ సీట్ల కేటాయింపులో ఏ ఒక్క పార్టీ కూడా యాదవ సామాజిక వర్గానికి అసెంబ్లీ టికెట్ ఇవ్వలేదన్నారు. జిల్లాలో న్యాయవాదిగా, యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా తనవంతు ముద్ర వేసుకున్నానని ఒక సారి అవకాశం ఇస్తే వారి సేవ చేస్తానని తెలిపారు. పిసిసి అధ్యక్షుడు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

బహిరంగ ప్రకటన

మా కక్షిదారు అయిన అన్నమయ్య జిల్లా కంభంవారిపల్లె మండలం గర్నిమిట్ట గ్రామం మజరా బలిజపల్లిలో కాపురం యుండు సూగాని శివకుమార్ భార్య శ్రీమతి సూగాని హేమబిందు తరఫున ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా..

నా కక్షిదారు 12-6-2017 వ తేదీన ఈ క్రింద కనబరచిన షెడ్యూల్ దాఖల స్థలమును రూ.1,99000/- లకు అన్నమయ్య జిల్లా పీలేరు మండలం పీలేరు గ్రామం మరియు పోస్టు బలిజ వీధి తలుపు నెంబర్ 7-101 నందు కాపురం యుండు లేట్ వినియాల నారదమని కుమారుడు పార్థసారథి మరియు ఇతని కుమారుడు ఎం.వసంత్ కుమార్ ద్వారా కొనుగోలు చేసి స్వాధీనము అనుభవము హక్కు కలిగి ఉన్నారు. సదరు విక్రయ పత్రం పీలేరు సబ్ రిజిస్ట్రర్ వారి కార్యాలయం నందు దస్తావేజు నెంబర్ 1223/2017 గా నమోదైనది. కావున నా కక్షిదారు షెడ్యూల్ దాఖల ఆస్తిని బ్యాంకుల నందు రుణమును గైకొనుటకు ప్రయత్నించుచున్నారు. ఇందుకు సంబంధించి ఎవరికైనా ఎటువంటి ఆక్షేపణలు ఉన్న ఎడల ఈ దినము నుండి ఏడు రోజుల లోపల ఆక్షేపణలు తెలియపరచవలసినదిగా కోరడమైనది. లేనియెడల మా కక్షిదారు సంపూర్ణ అధికారములు అనగా స్వాధీనం హక్కు కలిగి ఉన్నారని భావించబడును.

షెడ్యూల్.. చిత్తూరు డిస్ట్రిక్ట్ పీలేరు మండలం పీలేరు గ్రామపంచాయతీ పీలేరు గ్రామ వార్డ్ నెంబర్ 2 చెన్నారెడ్డి వీధి రెసిడెన్షియల్ ఏరియాలో డోర్ నెంబర్ 2-2063/5-11 గల ఇంటికి సమీపమున గల జాగా వివరం. సర్వే నంబర్ 159/4లో ప్లాట్ నెంబర్ 13 లో 15 అడుగులు ప్లాట్ నెంబర్ 14 లో 2 అడుగులు వెడల్పుతో దక్షిణ దిశగా గల జాగాకు **చెక్కుబందు వివరం.. తూర్పు:** ప్లాట్ నెంబర్లు 17, 18 గల జాగాలు **పడమర:** 18 అడుగులు వెడల్పు గల రోడ్డు **ఉత్తరం:** ఈ దినం మేము ప్లాట్ నెంబర్ 13 లో ఎం.నాగమ్మకు విక్రయించిన జాగా **దక్షిణం:** ఈ దినం మేము ప్లాట్ నెంబర్ 14 లో ఎం.నాగమ్మకు విక్రయించిన జాగా యీ మధ్య 15 అడుగులు లేక 15.250 మీటర్లు ఉత్తర దక్షిణం 17 అడుగులు లేక 5.185 మీటర్లు ఇందులకు సరియగు 94.4 చదరపు గజములు గల జాగా పూరా.

వల్లెపు చిన్నరెడ్డెప్ప, బి.ఎ.బి.ఎల్,
అడ్వకేట్, శ్రీనివాస నగర్,
- పీలేరు -517214
సెల్: 9440540769

నేడు ఎమ్మెల్యే రాక

ప్రజాశక్తి - సుండుపల్లి

మండలంలోని సొంతవారిపల్లె గ్రామపంచాయతీలో శనివారం జరిగే జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి హాజరవుతున్నట్లు మండల జెసిఎస్ కన్వీనర్ రెహమానీఖాన్ పేర్కొన్నారు. సొంత వారిపల్లె, రాయవరం గ్రామ పంచాయతీలో నిర్వహించే కార్యక్రమానికి మండలంలోని అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, నాయకులు పాల్గొనాలని కోరారు. ప్రజల తమ సమస్యల పరిష్కారం ఒక్క వేదిక జగనన్న సురక్ష కార్యక్రమం అని తెలిపారు.

'ఉపాధి' పనుల్లో అవకతవకలపై పీడీ ఆగ్రహం

ప్రజాశక్తి-కురబలకోట

పనులు చేయకుండా బిల్లులు చెల్లించడం, పని ప్రారంభించే ముందు ఫొటోలు తీయకుండా పని చేసేటప్పుడు ఫోటోలు తీయడం వెనుక అనుమానం వ్యక్తమవుతుందని డ్వామా పీడీ మద్దిలేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయ అవరణంలో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2022-23 ఆర్థిక సంవత్సరానికి జరిగిన పనులకు సామాజిక తనిఖీ నిర్వహించామన్నారు. సంవత్సర కాలంలో జరిగిన పనులు ఆర్థిక సంవత్సరానికి మొత్తం రూ.5.76 కోట్లు ఖర్చు చేశామన్నారు. వేతన దారులకు రూ.3.12 కోట్లు మెటీరియల్ రూపంలో రూ.2.64 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. మెటీరియల్ సంబంధించి ఉపాధిహామీ, ఆర్‌డబ్ల్యుఎస్, సర్వశిక్ష అభియాన్, పంచాయతీరాజ్ అన్ని కన్వర్జేన్స్ శాఖలు కలిసి పనులు చేసినట్లు తెలిపారు. సామాజిక తనిఖీ అక్రమాల్లో వచ్చిన రికవరీ కంటే సామాజిక తనిఖీ బృందం ఖర్చులే ఎక్కువ అయ్యాయని అన్నారు. సామాజిక తనిఖీ లో రూ.1978లు రికవరీకి ఆదేశించారు. మొక్కల పెంపకంలో చనిపోయిన మొక్కల స్థానంలో తిరిగి మొక్కలు నాటించాలని ఆదేశించారు. కార్యక్రమానికి ఎంపిపి దస్తగిరి, ఎంపిడిఒ దిలీప్‌కుమార్, ఎపిడి నందకుమార్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి ప్రకాష్, శివ ప్రసాద్, చంద్రమోహన్, మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, జడ్‌పిటిసి బైసాని జ్యోతి, అంగళ్లు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ఉమాపతిరెడ్డి, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఎపిఒ వెంకటేష్ పాల్గొన్నారు.



బహిరంగ సభలో వివరాలు వెల్లడిస్తున్న సామాజిక బృందం

వాలంటీర్లకు పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న వాలంటీర్లపై జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని వైసిపి జెసిఎస్ మండల కన్వీనర్ రెడ్డిహరి పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని ఐదు సచివాలయ కన్వీనర్లు పవన్ వ్యాఖ్యలకు నిరసన కార్యక్రమం చేపట్టారు. వాలంటీర్లపై నిందలు వేసిన పవన్ కల్యాణ్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్లు కంచి కళ్యాణ్‌కుమార్‌రెడ్డి, సిఆర్ చిన్నికృష్ణ, అంజమ్మ, జీవి రామకృష్ణ, హరికృష్ణ, రమేష్‌రెడ్డి, జనార్ధన్ వాలంటీర్లు, గృహ సారధులు పాల్గొన్నారు. **నంద లూరు:** పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా వాలంటీర్ల ర్యాలీ నిర్వహించి బస్టాండ్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. అరవపల్లె పంచాయతీ కార్యాలయం నుంచి బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. పావలా కళ్యాణ్ డౌన్ డౌన్, ప్యాకేజి కళ్యాణ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. వాలంటీర్ల పై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్‌కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.



పవన్‌కల్యాణ్‌కు వ్యతిరేకంగా ఆందోళన నిర్వహిస్తున్న వాలంటీర్లు

దళితుల స్థలం కబ్జాకు యత్నం

- అడ్డుకున్న బాధితులు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని పాటూరు పంచాయతీ ఎర్రిపాపయ్యపల్లె దళితవాడలో దళితుల స్థలం కబ్జాయత్నం చేయడంతో బాధితులు అడ్డుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో శుక్రవారం ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. కాంగ్రెస్ హయాంలో దళితులకు ఇచ్చిన ఇంటిపట్టా స్థలాలను అక్రమంగా బియ్యపు చెంగల్‌రెడ్డి అనే వ్యక్తి జెసిబి తో చదును చేయడంతో బాధిత దళితులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన పట్టా స్థలాల్లో కాసుల గుట్టనరసింహస్వామి ఆలయానికి దారి కూడా ఇచ్చామన్నారు. చెంగల్‌రెడ్డి దారితో పాటూ తమ ఇంటి స్థలాలను ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కబ్జాల నుంచి కాపాడి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని బాధితులకు నచ్చజెప్పి గొడవను సద్దుమణిగించారు.

రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలి

ప్రజాశక్తి-గాలివీడు

ప్రతి రైతు తమ భూమి ఆన్‌లైన్‌లో ఉందో లేదో చూసుకోవాలని తహశీల్దార్ దైవాదీనం పేర్కొన్నారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో చాలామంది రైతులు తమ భూములు ఆన్‌లైన్‌లో ఇంకొకరి పేరు నమోదయ్యాయని ఫిర్యాదు చేయడంతో ఆయన స్పందించారు. ఎన్నో సంవత్సరాల క్రితం అగ్రిమెంట్లు రిజిస్ట్రేషన్ అయి ఉంటే వారు ఇంతవరకు కూడా ఆన్‌లైన్ చేసుకోకుండా ఉంటారని అటువంటి వారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. విఆర్‌ఒలను, రెవెన్యూ కార్యాలయాన్ని సంప్రదిస్తే భూ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. రైతులు భూ సమస్యలు లేకుండా సరిచూసుకోవాలన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపరాదు

ప్రజాశక్తి-కలకడ

మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎస్ఐ తిప్పేస్వామి సూచించారు. మండల కేంద్రమైన కలకడ పోలీస్‌స్టేషన్ ఎదుట వాహనాలను తనిఖీలు నిర్వహించారు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండి వాహనములకు సంబంధించిన రికార్డులు కలిగి ఉండాలన్నారు. లేకుంటే వారికి అపరాధ రుసుములు విధించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని తెలిపారు. రికార్డులు సక్రమంగా లేని మూడు వాహనములకు ఒక్కొక్క వాహనానికి రూ.5వేలు వంతున మూడు వాహనములకు రూ.15 వేలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. వాహనంలో ప్రయాణిస్తున్న డ్రైవర్లకు మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించి యంత్రముతో తనిఖీ చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది యోగేష్, డ్రైవర్ రమేష్ పాల్గొన్నారు.

నేడు విశ్వం ఇంజినీరింగ్ కళాశాలలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-కురబలకోట

అంగళ్లు సమీపంలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డి.రమణారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో జరిగే జాబ్‌మేళాలో టాటా పవర్, విస్ట్రాన్, స్పైడర్ ఎలక్ట్రిక్, డిక్సన్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ పూర్తయిన విద్యార్థులు పాల్గొనవచ్చని సూచించారు. ఒకొక్క కంపెనీలో 300 పైగా ఉద్యోగ అవకాశాలు వున్నాయని అన్నారు. ఈ కంపెనీలలో సంవత్సరానికి రూ.3 లక్షల వరకు జీతం ఉంటుందని అన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

దళితుల అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

దళితులు, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డితో సాధ్యమని వైసిపి ఎస్‌సి విభాగం జిల్లా అధ్యక్షులు మద్దెల రవీంద్ర, సర్పంచ్ గంగులమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక గాంధీ బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమిలేని దళిత, బడుగు బలహీన వర్గాలకు చెందిన 46,395 మందికి 54,129.45 ఎకరాల భూ పంపిణీకి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్రంలో కులమత, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తూ, రాష్ట్ర ప్రజలందరికీ నేరుగా వారి ఖాతాలకే సొమ్ము జమ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రాయుడు, గాంధీపేట రఘు, గాంధీపేట సుధా, శ్యామ్, రాజేష్, నాగార్జున, రవి, చలపతి పాల్గొన్నారు.

వినయ్ కుమార్‌కు అరుదైన గౌరవం

రాయచోటి : ఉత్తమ సేవలతో ప్రజల్లో గుర్తింపు పొందిన రాయచోటి యువకుడు వినయ్ కుమార్‌కు అరుదైన గౌరవం లభించింది. వినయ్ కుమార్ సేవలను గుర్తిస్తూ భీమవరంలోని గునుపుడి సోమరామ ఆలయం ఇఒ సురేష్ నాయుడు అధ్వర్యంలో ఆలయ వేద పండితుల చేతుల మీదుగా సన్మానించారు. వినయ్ కుమార్ విద్యార్థి దశ నుంచే ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఐదేళ్ల నుంచి రక్తదాన కార్యక్రమాలు, మెడికల్ క్యాంప్‌లు, అన్నదానం, విద్యార్థులకు ఉచిత రక్త నిర్ధారణ పరీక్షలు, కంటి పరీక్షలు, విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలు, యువతకు అవగాహన సదస్సులు నిర్వహించి విస్తృత స్థాయి సేవ కార్యక్రమాలు చేస్తున్నారు. నాలగేళ్లుగా విద్యార్థుల్లో ఉండే నైపుణ్యాలు, నైతిక విలువలను వెలికితీసేందుకు క్రీడ, సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు, వైజ్ఞానిక సదస్సులు, వ్యాసరచన, చిత్రలేఖనం, పాటలు పోటీలు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఉచితంగా నిర్వహించారు. సేవలకు గుర్తింపు పొంది అతి చిన్న వయసులోనే నిస్వార్థంగా మంచి పేరు సంపాదించుకొని మంచి సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు గుర్తించి సత్కరించారు.

బిజెపి సివిల్ కోడ్‌కు బిఎస్‌పి వ్యతిరేకం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మైనార్టీ అభిప్రాయ సేకరణ చేయకుండా మైనార్టీల హక్కులను కాలరాయడానికి ఈ చట్టాన్ని తీసుకొస్తుందని బిఎస్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవానికి యూనిఫాం సివిల్ కోడ్‌లో మతానికి సంబంధించి కొన్ని మంచి అంశాలు కొన్ని ఇబ్బందికర అంశాలు ఉన్నాయన్నారు. ఈ యూనిఫాం సివిల్ కోడ్ పైన వైసిపి టిడిపిలు తమ అభిప్రాయాలను ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం బిజెపితో గల్లీలో కుస్తీ ఢిల్లీలో దోస్తీ చేస్తూ తమ కార్యకలాపాలు గడుపుకుంటూ ప్రజా ప్రయోజనాలను, మైనారిటీలను, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మోసం చేస్తుందని తెలిపారు. బహుజన సమాజ్ పార్టీ ఖచ్చితంగా యూనిఫామ్ సివిల్ కోడ్ బిల్లుని వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మైనార్టీ నాయకులు అన్సర్‌బాషా, అసెంబ్లీ అధ్యక్షులు రమణ, జిల్లా ఇన్చార్జి బాలాజీ, శ్రీనాథ్, గంగాధర్ పాల్గొన్నారు.

అక్రమంగా వెలిసిన బోర్లు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణ నడిబొడ్డున కోటి రూపాయలు విలువైన స్థలంలో మున్సిపల్ అధికారుల అనుమతులు లేకుండా చోటు బఫర్ జోన్ కిందికి వచ్చే స్థలంలో అనధికారికంగా రెండు బోర్లు డ్రిల్లింగ్ చేశారు. పట్టణం లోని సిటిఎం రోడ్డులో గుట్టు చప్పుడు కాకుండా అన్యాక్రాంతమైన ప్రభుత్వ స్థలంలో యథేచ్ఛగా రెండు బోర్లు వేయడం చర్చ నియాంశంగా మారింది. వీరికి ప్రభుత్వం పెద్దలు, అధికారుల అండ దండలు ఉన్నట్లు విమర్శలు గుప్పుమంటున్నాయి. ఈ విషయమై మునిసిపల్ కమిషనర్‌ని వివరణ కోరగా తాముబోర్లు వేసుకునేందుకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు.

సంపద వనరుల కేంద్రాన్ని సందర్శించిన ఇఒపిఆర్‌డి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని గువ్వల చెరువు గ్రామపంచాయతీ సంపద వనరుల కేంద్రం, గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఇఒపిఆర్‌డి ఉషారాణి ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో ఉన్న చెత్తాచెదారాలన్నీ గ్రీన్ అంబాసిడర్లకు తరలిస్తే వారు తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి సంపద వనరుల కేంద్రంలోకి చేర్చాలన్నారు. ఇందులో వానపాముల తయారీ, ద్వారా పంట పొలాలకు మంచి ఎరువులు చేసుకోవచ్చని తెలిపారు. ఆ గ్రామం లోని ప్రజలు అంతా గ్రీన్ అంబాసిడర్‌లకు సహకరించాలన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు మండలం, బోడుమల్లువారిపల్లి దళితవాడ బాధితులకు న్యాయం చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మదనపల్లి డిఎస్‌పి సుధాకర్ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు విచారణ కోసం శుక్రవారం బోడుమల్లువారిపల్లి హరిజనవాడకు వచ్చిన సందర్భంగా మాల మహానాడు, ఎంఆర్‌పిఎస్, డిబిఎస్‌ఎఫ్ నాయకులు డిఎస్‌పిని కలిసి హరిజనవాడ వాసి ఆర్.సత్యనారాయణపై రాళ్ళ దాడి చేసి గాయపరిచిన సంఘటనపై దోషులను కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ దళితులపై రోజురోజుకు దాడులు ఎక్కువ అవుతున్నాయని అన్నారు. బోడుమల్లువారిపల్లి హరిజనవాడ దళితులపై గత కొన్ని సంవత్సరాలుగా దాడులు జరుగుతూనే ఉన్నాయన్న ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ విచారణలో పీలేరు ఎస్ఐ నరసింహుడు, మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తుమ్మల ధరణి కుమార్, ఎంఆర్‌పిఎస్ నాయకుడు నగిరిమడుగు సుధాకర్‌బాబు, దళిత బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బద్దే అనే భాను ప్రకాష్, ద్వారకనాథ్, జి. ఉదయ్ కుమార్, మహేష్, బి.ఆర్ శ్రీనివాసులు, ఈ. శ్రీనివాసులు, చలపతి, ఆర్.సత్యనారాయణ, తల్లికృష్ణమ్మ, శ్రీధర్, శశిధర్ పాల్గొన్నారు.

21, 31 జిఒలను రద్దు చేయాలి


ప్రజాశక్తి-రాజంపేట రూరల్

రాష్ట్రంలో ఆటో, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులపై పెద్ద మొత్తంలో జరిమానాలు విధించేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 21, 31ని తక్షణమే రద్దు చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల రాధాకృష్ణ సాంబశివ, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఎస్.రాయుడు డిమాండ్ చేశారు. ఆటో వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహన యజమానులతోపాటు ఆటో డ్రైవింగ్ లైసెన్సు ఉన్న ప్రతి కార్మికునికీ వాహన మిత్రను అమలు చేయాలన్నారు. వాహన మిత్రతో ఆటో కార్మికులకు ఎలాంటి న్యాయం జరగదన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాజంపేట పట్టణ కార్యదర్శి సికిందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, నాయకులు నాగేశ్వరరావు, గంగయ్య,సుబ్బారాయుడు, చోటు, యల్లారెడ్డి, మస్తాన్, శీను, బ్రహ్మయ్య, సురేష్, వెంకటేష్, గంగాధర్, విజయ్ భాస్కర్, లక్ష్మి నారాయణ, ఆది నారాయణ పాల్గొన్నారు.

గైనకాలజిస్టుగా డాక్టర్ తేజశ్రీ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆస్పత్రిలో గైనకాలజిస్ట్ డాక్టర్ తేజశ్రీ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈమె వైద్య విద్య పూర్తి చేసి మొట్టమొదటిగా గైనకాలజిస్ట్‌గా ఇక్కడ ఉద్యోగంలో చేరారు. గ్రామీణ మహిళలు, గర్భిణులు, బాలింతలకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. మాతా శిశు మరణాలను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు చేపడతానని తెలిపారు. మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.



చిన్నమండెం : లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న సర్పంచ్ నజీర్‌బాషా

ప్రజల ముంగిటికే ప్రభుత్వ సేవలు

-మున్సిపల్ ఛైర్‌పర్సన్ వి.మనూజ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన 11 రకాల ధృవపత్రాలను అందిస్తున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ వి.మనూజ పేర్కొన్నారు.శుక్రవారం 23,26వ వార్డులకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సొసైటీ కాలనీలో రామాలయం ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి నిరుపేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమిస్తున్నారని, ఇందుకోసం నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నారని కొనియాడారు. దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకట శివారెడ్డి, ఈశ్వర్‌నాయక్, ఎం.వి.రమణ, వైసిపి నాయకులు సాయిశేఖర్ రెడ్డి, రెడ్డెప్ప యాదవ్ పాల్గొన్నారు. **చిన్నమండెం :** మండలంలోని మల్లూరు కస్పాలో నిర్వహించిన జగనన్న సురక్ష పథకం కార్యక్రమంలో సర్పంచ్ నజీర్‌బాషా పాల్గొన్నారు. అధికారులతో కలిసి అర్హులైన లబ్దిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో మండల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

20న మెగా ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-రామాపురం

ఈనెల 20న గురువారం ఉదయం 8 గంటలకు శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి తిరుపతి వారు మండల కేంద్రంలోని రామాపురంలోని వైసిపి కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని ప్రారంభిస్తారని చెప్పారు. కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలు సరైన చికిత్సలు చేయించుకోవాలన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉంటారని, అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చిన అందరికీ ఉచితంగా పరీక్షలు, మందులు కూడా పంపిణీ చేస్తారని, భోజన సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రెటరీ సూరం వెంకటసుబ్బారెడ్డి, నల్ల గుట్టపల్లె గ్రామ సర్పంచ్ అయోధ్యపురం నాగభూషణ్‌రెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ తిరుపతి ఆంజనేయులు, శ్రీధర్‌రెడ్డి చెన్నారెడ్డి, రాజు పాల్గొన్నారు. **పెద్దమండ్యం :** మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడానికి జగనన్న సురక్ష పథకం ముఖ్య ఉద్దేశ్యమని ఎంపిపి పూర్ణచంద్రిక రమేష్, వక్ఫ్ బోర్డ్ వైఎస్ చైర్మన్ రషీద్ బేగ్ పేర్కొన్నారు. బండమీదపల్లి ,కలిచెర్ల సచివాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాము, ఎంపిడిఒ శ్రీధర్‌రావు, ఇఒపిఆర్‌డి జనార్దన్, మండల వైసిపి కన్వీనర్ చాను, జెసిఎస్ కన్వీనర్ రెడ్డప్పరెడ్డి, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్లను రెచ్చగొట్టడం మానుకోవాలి

ప్రజాశక్తి-పీలేరు

జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను వక్రీకరించి వైసిపి నాయకులు వాలంటీర్లను రెచ్చగొట్టడం మానుకోవాలని పీలేరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి బెజవాడ దినేష్ తెలిపారు. శుక్రవారం నాలుగు రోడ్ల కూడలిలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ చిత్రపటానికి ఆయన పాలాభిషేకం చేశారు. వైసిపి నాయకులు తమ రాజకీయ లబ్ధి కోసం వాలంటీర్లను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వాలంటీర్లకు రూ.5వేలు వేతనమిస్తూ వారి దగ్గర వెట్టి చాకిరి చేయించుకుంటూందని విమర్శించారు. వారికి ప్రస్తుతం నెలవారీ ఇస్తున్న రూ.5వేలు ఏమాత్రం చాలదని, దాని స్థానంలో వారికీ నెలకు కనీస వేతనం రూ.15వేలు ఇవ్వాలని, దాని కోసం ప్రభుత్వంపై పోరాటానికైనా తాము సిద్ధమని తెలియజేశారు. కార్యక్రమంలో తిరుపతి మహేష్, జనసేన పార్టీ వీర మహిళ గాయత్రి, పీలేరు మండల ప్రధాన కార్యదర్శి గజేంద్ర, పవన్, కార్యదర్శి నవీన్, హరీష్, ధనుంజయ్, షఫీ, నవీన్, రాజేష్, విజయ్, గౌస్, మున్నా, బార్గవ, భాస్కర్, జనసేన వాల్మీకిపురం అధ్యక్షులు కిషోర్, ఉపాధ్యక్షులు సందీప్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, కార్యదర్శి బాలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి కేశప్ప

15 మందిపై రౌడీషీట్ నమోదు : డిఎస్‌పి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల పరిధిలోని అమరనారాయణపురం సమీపంలోని భూ వివాదంలో 15 మందిపై రౌడీషీట్ తెరిచినట్లు మదనపల్లి డిఎస్‌పి కె.కేశప్ప పేర్కొన్నారు. శుక్రవారం డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అమరనారాయణపురం సమీపంలోని సర్వే నంబర్ 385, 386లో 1.80 ఎకరాలలో భూమి కోసం ఇద్దరు దాయాదుల మధ్య తరచూ గొడవ పడుతుండటంతో గతంలో వీరిపై కేసునమోదు చేశామన్నారు. ఈ కేసు మదనపల్లి కోర్టులో విచారణలో ఉండగా మళ్ళీ రెండు పర్యాయాలు గొడవ పడడంతో మదనపల్లి రూరల్ సిఐ రామాంజనేయులు, బి.కొత్తకోట ఎస్ఐ రామ్మోహన్‌లు గతంలో వారికి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. మరల తరచూ గొడవలకు పాల్పడుతుండటంతో ఇరువర్గాలకు చెందిన 16 మందిపై బి.కొత్తకోట పోలీస్ స్టేషనులో రౌడీ షీట్‌ను నమోదు చేయడం చేసినట్లు డిఎస్‌పి వెల్లడించారు.

విద్యార్థిపై హత్యాయత్నం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఓ విద్యార్థిపై హత్యాయత్నంకు పాల్పడిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున వాల్మీకిపురం పొలిమేర్లలో చోటు చేసుకొంది. పోలీసుల వివరాల మేరకు.. తంబళ్లపల్లి మండలం ముద్దలదొడ్డికి చెందిన రవి (21) మదనపల్లి ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్నట్లు తెలిపారు. పుట్టిన రోజు వేడుకలను ఇంట్లో చెప్పి వాల్మీకిపురంకు వచ్చాడని అన్నారు. ఇక్కడ ఏమి జరిగిందో తెలియదు.. శుక్రవారం ఉదయం స్థానిక పొలిమేర్లలోని రైల్వే పట్టాల పక్కన రవి పడి ఉండటంతో స్థానికులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. రవిపై హత్యాయత్నానికి పాల్పడ్డారా లేక ఇతర కారణాల అనే విషయాలపై దర్యాప్తులో తేలుతుందన్నారు. ఈ ఘటనపై కేసునమోదు చేసినటుల ఎస్ఐ నాగేశ్వర రావు తెలిపారు.



చికిత్స పొందుతున్న రవి